క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.1.01 లక్షల విరాళం



కోడూరు: కోడూరులో నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి పూతబోయిన శ్రీనివాసరావు–లక్ష్మీకుమారి, నాగనరసింహారావు– దాక్షాయణి, నాగమణికంత– వాణి దంపతులు రూ.1,01,116 నగదును విరాళంగా అందించారు. సోమవారం ఈ నగదును కమిటీ సభ్యులకు ఇచ్చారు. సుమారు రూ.8 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ క్షేత్రానికి తమ వంతు సహాయం అందించడం సంతోషంగా ఉందని దాతలు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకటసుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్‌చంద్రబోస్, అన్నం రవిభాస్కర్, ఉల్లి రంగారావు, అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



నాగాయలంక: మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.సంజీవరావు పర్యవేక్షణలో మండలంలోని 16 రైతుభరోసా కేంద్రాల్లో 50శాతం సబ్సిడీపై మొత్తం 22క్వింటాళ్ల విత్తనాలను వంద మంది రైతులకు సోమవారం గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా అందజేశారు. వీఏఏలు మాట్లాడుతూ 94 క్వింటాళ్ల పిల్లిపెసర, 20 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావల్సిన రైతులు ఆధార్ కార్డు, భూ వివరాలతో ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు. జీలుగ విత్తనాలు కేజీ సబ్సిడీ ధర రూ.44 కాగా పిల్లిపెసర రూ.67లకు రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

సీనియర్ న్యాయవాది నారాయణరావుకు నివాళి




మచిలీపట్నంటౌన్: సీనియర్ న్యాయవాది ఆకునూరి నారాయణరావు (91) సోమవారం మరణించారు. చెమ్మనగిరిపేటలోని ఆయన స్వగృహం వద్ద నారాయణరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) సందర్శించి నివాళులు అర్పించారు. నారాయణరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. నారాయణరావు మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తికి, పేర్ని నానికి అత్యంత సన్నిహితులుగా మెలిగారు. పలువురు న్యాయవాదులు కూడా నారాయణరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అగ్ని ప్రమాదబాధితులకు ఆర్థిక సాయం



కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ ఎన్టీఆర్ కాలనీలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు రాచూరి వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులు ముగ్గురికి పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు సోమవారం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందచేశారు. బాధితులు రాచూరి లంకేశ్వరావు కుమార్తె చదువుపట్ల ఉన్న ఆసక్తిని గమనించి పుస్తకాల కొనుగోలుకు మరికొంత నగదు అందించారు. భవిష్యత్‌లో చిన్నారి విద్యా అవసరాల నిమిత్తం పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ దిడ్ల రాంబాబు, ఉప సర్పంచ్ ముమ్మనేని బాబూరావు, చందన రంగారావు, కేసాని శివుడు, వర్రె బసవరావు, చంద్ర, శ్రీనివాసరావు, బుజ్జి, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి ప్రధాన గుడిసెంటర్‌లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాసరావు, క్లబ్ సభ్యులు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, కందుల సీతారామయ్య, దుర్గా ప్రసాద్(బీడీఆర్), తదితరులు పాల్గొన్నారు.

వినోదం.. ఆహ్లాదం..



బైపాస్‌రోడ్ రింగ్ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ముఖద్వారం

- నగరంలో ఎగ్జిబిషన్ల సందడి
- వేసవిలో నగర ప్రజలకు అందుబాటులో..
- ఆకర్షిస్తున్న రంగురంగుల అండర్ వాటర్ టన్నెల్
- ఎక్వేరియమ్స్, జెయింట్ వీల్స్ ప్రత్యేక ఆకర్షణ

మచిలీపట్నం టౌన్: వేసవి సెలవుల్లో చిన్నారులతో పాటు పెద్దలకు సైతం నగరంలో ఏర్పాటు చేసిన రెండు ఎగ్జిబిషన్లు వినోదాన్ని పంచుతున్నాయి. వేసవిలో సేదదీరడం కోసం పార్కులకు వెళ్లేందుకు మక్కువ చూపుతున్న నగర ప్రజలకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచడానికి ఈ ఎగ్జిబిషన్‌లు ఎంతగానో దోహదపడుతున్నాయి.



వాటర్ అండర్ టెన్నెల్ చేపల ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

నగరంలోని బైపాస్ రోడ్ హౌసింగ్ బోర్డు రింగ్ వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో రంగు రంగు చేపల అండర్ వాటర్ టెన్నెల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఎక్వేరియం విభాగాన్ని తిలకించడానికి ప్రజలు మక్కువ చూపుతున్నారు. వీటితో పాటు జెయింట్ వీల్స్, ఇతర ఆటల పరికరాలు ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. పలు రకాల తినుబండారాలు, ఫ్యాన్సీ, రెడీమేడ్ డ్రెస్‌లు, ఫన్నీ ఆటలు వంటికి అందుబాటులో ఉండటంతో ప్రజలు వినోదాన్ని ఆశ్వాదిస్తున్నారు. ఇదే రోడ్‌లో ఏర్పాటు చేసిన మరో ఎగ్జిబిషన్ కూడా నగర ప్రజలకు వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందిస్తోంది.

రైతులూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోండి

ఘంటసాల: రైతులు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని ఘంటసాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీలత అన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవంలో భాగంగా ఘంటసాలలో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. డాక్టర్ పి.శ్రీలత మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం వారి కృషి విజ్ఞాన కేంద్రం, విత్తన పరిశోధన కేంద్రం వారు వరి, మినుము, ఇతర పంటల విత్తనాలను తయారు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం, యంత్రపరికరాల వినియోగం, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలతో పంటలు పండిస్తే తక్కువ ఖర్చుతో లాభాల పొందవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన విద్యార్థినులకు సహకరించిన రైతులకు శ్రీలత కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థినుల భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఘంటసాల కేవీకేలో ఎంటీయూ 1061(ఇంద్ర), ఎంటీయూ 1318 పునాది విత్తనాలు జూన్ మొదటి వారం నుంచి అందుబాటులో ఉంటాయని, 30కేజీల బస్తా రూ.1200లకు అమ్మడానికి సిద్ధంగా ఉంటాయని తెలిపారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ రకాల వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలను శాస్త్రవేత్తలు, రైతులు తిలకించారు. సదస్సును ఉయ్యూరు ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.నాగేంద్రరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఘంటసాల ఎఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్, డాక్టర్ యశ్వంత్, రైతులు పాల్గొన్నారు.



వ్యవసాయ ప్రదర్శనలో శాస్త్రవేత్తలు శ్రీలత, నాగేంద్రరావు, రైతులు

230 మందికి ఉచిత హోమియో వైద్యం

చల్లపల్లి: చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక సీఆర్ వికాస కేంద్రం ఆవరణలోని హోమియో సెంటర్‌లో శిబిరం ఏర్పాటు చేయగా హోమియో వైద్యులు 230 మందికి వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మందులు ఉచితంగా అందించారు. శిబిరాన్ని వికాస కేంద్రం ప్రతినిధి అడ్డాడ ప్రసాద్ బాబు పర్యవేక్షించారు.

చాలీసా పారాయణం



బంటుమిల్లి: పాశ్చాపురంలో వేంచేసి ఉన్న శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం సోమవారంతో మండలం(40) రోజులు ముగిసింది. గత నెల 17వ తేదీ శ్రీరామ నవమి నుంచి మొదలైన చాలీసా పారాయణం జూన్ ఒకటో తేదీ హనుమాన్ జయంతితో ముగియనుంది. చాలీసా పారాయణ కార్యక్రమంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు

గుడివాడరూరల్: గ్రామాల్లో బహిరంగంగా మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. నందివాడ మండలంలోని జనార్దనపురం శివారు నూతులపాడులో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎస్ఐ సోమవారం పర్యటించారు. గ్రామంలో రోడ్ పక్కనే బహిరంగంగా మద్యం తాగుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పుస్తక పఠనంతో పెంపొందనున్న ఆలోచనాశక్తి



జమీగొల్వేపల్లిలో సుమతీ, వేమన శతక పద్యాలను పఠిస్తున్న విద్యార్థులు

జమీగొల్వేపల్లి(పామర్రు): పుస్తకాలు, పద్యాలను చదవడం వలన విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, సృజనాత్మకత పెంపొందుతుందని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, ఉపాధ్యాయుడు దీవి వంశీకృష్ణ పేర్కొన్నారు.

మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా సోమవారం వేమన, సుమతి శతక పద్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన, సుమతి శతక పద్యాలలోని నీతిని, భావాన్ని గ్రహించడం ద్వారా ఉత్తమ విద్యార్థులుగా, ఉత్తమపౌరులుగా రూపొందుతారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి. నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో ..

వాతావరణంలో కాలుష్యనివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని పామర్రు ద్వితీయశ్రేణి గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీ రాణి పేర్కొన్నారు. గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణలో భాగంగా సోమవారం మొక్కలను నాటారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించారు.



పామర్రు గ్రంథాలయంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పమిడిముక్కల: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రంథపాలకులు సాలార్ షరీఫ్ పర్యవేక్షించారు. విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని షరీఫ్ కోరారు. విద్యార్థులు ఉన్నత స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

కలిదిండి: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని కోరుకొల్లు గ్రంథాలయ అధికారి రాఘవులు అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం 'పుస్తకాలు, వాటి లాభాలు' అనే అంశంపై గ్రంథాలయాధికారి విద్యార్థులకు వివరించారు. రాఘవులు మాట్లాడుతూ పిల్లలు తమకు నచ్చిన పుస్తకాలను ఎంచుకుని అందులోని కథలను చదివి వాటి సారాంశాన్ని తెలుసుకున్నారని తెలిపారు. విద్యార్థులు నాలెడ్జి పెంచుకోవానలి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ ఏడో తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి రెండో విడత కౌన్సెలింగ్

పెడన: గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతితో పాటు ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి సంబంధించి రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ కుంటముక్కల గురుకుల పాఠశాలలో ఈ నెల 29న నిర్వహించనున్నారని బల్లిపర్రు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.రూతమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జి. కొండూరు మండలం కుంటుముక్కల గురుకుల పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఐదో తరగతి వారికి, మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్ వారికి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలకు సంబంధించి కుంటముక్కలలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. బల్లిపర్రు గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీలు 36, బీసీ–సీ 10, బీసీలు 2 మొత్తం 48 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఎస్సీ 15, ఎస్టీ–2, బీసీ –2, బీసీ సీ 10 మొత్తం 29 ఖాళీలున్నాయని తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసి సీట్లు పొందని వారికి మాత్రమే ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉందని ఆమె స్పష్టం చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆదాయం, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, మార్కుల జాబితాలు, ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణత కార్డులతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సిందిగా ఆమె సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

రామవరప్పాడు: యుక్త వయస్సులో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పీఎస్ఆర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం ఏరియాలో సోమవారం 'రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని' పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న బాలికలు నెలసరి సమయంలో వచ్చే సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. శానిటేషన్ ప్యాడ్‌ల వినియోగం పట్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టిక ఆహార పదార్థాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెనేజర్ రీటా, శారదా, కిశోర బాలికలు, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సాయం

కోడూరు: వేటపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి పుట్టి ఒనిక చదువు నిమిత్తం పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు రూ.15వేల నగదును ఆర్థిక సాయంగా అందించారు. నగదును సోమవారం ఒనిక, తన తండ్రి క్రీస్తురాజుకు అందించారు. ప్రస్తుతం ఒనిక నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతుండగా, ఆర్థిక ఇబ్బందులతో చదువును ముందుకు కొనసాగించే పరిస్థితి లేకపోవడంతో విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు సాయాన్ని అందజేశారు.

ఏడెకరాల గడ్డివామి దగ్ధం

గూడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని తుమ్మలపాలెంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడెకరాల గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన బొప్పన నాంచారయ్య తన స్థలంలో గడ్డివామి ఉంది. దగ్గర నుంచి వెళ్తున్న విద్యుత్ తీగల రాపిడితో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో గడ్డి వామి మొత్తం తగలబడిపోగా బందరు అగ్నిమాపకదళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. ప్రమాదంలో రూ.60వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ఉపాధ్యాయుడు మరణిస్తే కుటుంబంలో ఒకరికి కారుణ్య ఉద్యోగం

మచిలీపట్నం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 84 జీవోకు ముందు కానీ తర్వాత కానీ నగర పాలక సంస్థ పాఠశాలల్లో పని చేస్తూ మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇస్తారని నగర కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం, సీడీఎంఏ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. వీటి ప్రకారం ఉపాధ్యాయునిగా పని చేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98499 05820, 73860 04666 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు శ్రీవారి శాంతి కల్యాణం

మచిలీపట్నంటౌన్: నగరంలో బచ్చుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29వ తేదీ బుధవారం శ్రవణ నక్షత్రం సందర్భంగా స్వామివారి శాంతి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆలయంలో ప్రారంభమవుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

కంకిపాడు: మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలు చేయాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని ఎంఈఓ కె.ప్రసాద్ అన్నారు. ఎంఆర్సీ సెంటరులో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతాయుతంగా విద్యార్థులకు అందించాలని సూచించారు.

కౌంటింగ్ రోజు గొడవలు చేస్తే రౌడీషీట్

చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్

ఘంటసాల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరిగే వేళ ఎవరైనా గొడవలు చేస్తే వారిపై రౌడీషీట్ తెరుస్తామని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. ఘంటసాల పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకరించిన రాజకీయ పార్టీల నేతలు కౌంటింగ్ సమయంలో కూడా సహకరించాలని కోరారు. ఎన్నికలు పురస్కరించుకుని ఏ గ్రామంలోనైనా అల్లర్లు సృష్టించినా, గొడవలు పడినా కఠిన చర్యలు తీసుకోవడంతో వారిపై రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లోని యువత, పార్టీల కార్యకర్తలు, నాయకులు ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ప్రశాంత వాతావరణం ఉండేలా నేతలు చూడాలని సీఐ నాగప్రసాద్ కోరారు. సమావేశంలో పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి సీహెచ్ పద్మారావు, వైఎస్సార్ సీపీ తరుపున ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షులు దిరిశం పిచ్చేశ్వరరావు, వైస్ ఎంపీపీ మాడెం నాగరాజు, పార్టీ నేత దోనె వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ తరపున టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు బండి పరాత్పరరావు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు, ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న చల్లపల్లి సీఐ నాగప్రసాద్

కోడూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తర్వాత శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఘర్షణలు, అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్ తెరుస్తామని అవనిగడ్డ సీఐ త్రినాథ్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అన్ని పార్టీల నేతలు సహకరించారని, కౌంటింగ్ రోజు, ఆ తర్వాత కూడా సహకరించాలని సీఐ సూచించారు. ఎస్ఐ శిరీష నేతలకు పలు సూచనలిచ్చారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం పార్టీల నేతలు పాల్గొన్నారు.



కోడూరులో రాజకీయ నేతలతో మాట్లాడుతున్న సీఐ త్రినాథ్

మట్టి అక్రమ తరలింపు.. సీజ్, జరిమానా

కోడూరు: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి జరిమానా విధించారు. ఆర్ఐ సుభాషిణి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మందపాకల రెవెన్యూ పరిధిలో మైనింగ్, రెవెన్యూ అనుమతులు లేకుండా పొలాల్లో నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం వచ్చింది. దీంతో ఘటనా స్థలాన్ని పరిశీలించడానికి వెళ్తుండగా పాదాలవారిపాలెం సమీపంలో ట్రాక్టర్లు మట్టిని నింపుకుని వస్తున్నాయి. అనుమతులు లేకపోవడంతో మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కార్యాలయంలో ఉంచినట్లు ఆర్ఐ చెప్పారు. తహసీల్దార్ ఆదేశాలతో ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.5వేలు జరిమానా విధించి, సీజ్ చేసిన ట్రాక్టర్లను విడిచిపెట్టినట్లు తెలిపారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీజ్ చేసిన ట్రాక్టర్లు

ముమ్మరంగా ఉపాధి పనులు

పెదపారుపూడి: మండలంలోని 19 గ్రామాల్లో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్నట్లు ఏపీఓ స్ఫూర్తి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వెంట్రప్రగడ, పెదపారుపూడి, ఈదులమద్దాలి, మోపర్రు, దోసపాడు, వానపాముల, పాములపాడు తదితర గ్రామాల్లో పంట బోదెల్లో తవ్వకం పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

4,031 మందికి ఉపాధి

మొవ్వ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సోమవారం మొవ్వ మండలంలో 4,031 మందికి సోమవారం ఉపాధి కల్పించినట్లు ఏపీఓ లక్ష్మీరెడ్డి తెలిపారు. మండలంలోని 21 గ్రామాల్లో 158 పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల పరిశీలన

కంకిపాడు: లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులను చేపట్టారు. ఈడుపుగల్లు గ్రామంలో చెరువు పూడికతీత పనులను సోమవారం ఏపీఓ రాజు పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 8,999 జాబ్ కార్డులు ఇచ్చామన్నారు. 12,171 మంది కూలీలు ఉపాధి పథకాన్ని వినియోగించుకుంటున్నారన్నారు. ఈ 2024–25 సంవత్సరంలో రూ.493.06 లక్షలు వెచ్చించాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. పనులు చేసిన 15 రోజుల్లో కూలీల వ్యక్తిగత ఖాతాలకు సొమ్ము జమ అవుతుందన్నారు. సరాసరిన రూ.269 కూలీ అందుతుందన్నారు. పనులు సమర్థంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.



ఈడుపుగల్లు చెరువులో పూడికతీత పనుల పరిశీలన